

నిమ్మకు నీరెత్తినట్టు..

నిమ్మకట్టుపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. దీంతో ఆయకట్టుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో



శ్రావణలక్ష్మికి పూజలు

డాబాగార్డెన్స్(విశాఖ) : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఆదివారం ఉదయం శ్రావణ లక్ష్మీ పూజలు నిర్వహించారు.



సందడిగా సాగరతీరం

కొమ్మాది(విశాఖ): సాగర్‌నగర్, రుషికొండ బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. సాగరతీరాలకు జనం భారీగా వెళ్లారు.

న్యూస్‌రీల్

నేడు తాండవ నీరు విడుదల



తాండవ రిజర్వాయరు

నాతవరం: తాండవ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు సోమవారం ఉదయం 8.45గంటలకు నీరు విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. ఆయకట్టుదారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో ఇటీవల సమావేశం నిర్వహించి, 19వ తేదీన నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ ఏడాది ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా నీటి విడుదల కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించ లేదని తెలిపారు. నీటి విడుదల విషయమై తాండవ ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. తాండవ ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రానికి 376.5 అడుగుల నీటిమట్టం ఉందన్నారు.

వరికి ఊపిరి పోసిన వర్షం



వడ్డాది జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

బుచ్చెయ్యపేట/వి.మాడుగుల రూరల్: జిల్లాలోని బుచ్చెయ్యపేట, వి.మాడుగుల మండలాల్లో భారీ వర్షం కురిసింది. 20 రోజులుగా వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. దీంతో నీరందక పలు గ్రామాల్లో వరి నాట్లు ఎండిపోయాయి. ఆదివారం సాయంత్రం సుమారు గంటన్నర సేపు కురిసిన వర్షం వరినాట్లకు ఊపిరి పోసింది. మెరక ప్రాంతాల్లో నాట్లు వేయడానికి ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా పలు రోడ్లు జలమయం కాగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొన్ని రోజులుగా ఎండ వేడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. కేజే పురం ఊరచెరువు కింద ఇటీవల వేసిన వరినాట్లు పూర్తిగా ముంపునకు గురయ్యాయి.

ప్రత్యేక అలంకరణలో నూకాంబిక



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: శ్రావణ ఆదివారాన్ని పురస్కరించుకుని స్థానిక గవరపాలెం నూకాంబిక బాలాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు చేశారు.

జూలో రెడ్ నెక్డ్ వాల్లబీ సందడి



యానిమల్ కీపర్‌కు అందకుండా పరుగెడుతున్న రెడ్ నెక్డ్ వాల్లబీ

ఆరిలోవ(విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. వన్యప్రాణులు ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ కనువిందు చేశాయి. ఇక్కడ రెడ్ నెక్డ్ వాల్లబీ ఎన్‌క్లోజర్‌లో గెంతులు వేస్తూ.. అటూ ఇటూ పరిగెడుతూ సందర్శకులను మరింతగా ఆకట్టుకుంది. ఇటీవల గుజరాత్ జూ నుంచి ఒక జత రెడ్ నెక్డ్ వాల్లబీని జూ అధికారులు ఇక్కడికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వాటి కోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్‌ను సిద్ధం చేశారు. దానిలో ఆదివారం యానిమల్ కీపర్ ఆహారం(పచ్చని ఆకులు) అందించే సమయంలో వాల్లబీలు పరుగులు తీశాయి. యానిమల్ కీపర్‌కు దూరంగా ఎన్‌క్లోజర్ లోపల అమర్చిన దుంగల మీదుగా ఎగురుతూ పరిగెడుతూ సందడి చేశాయి.

ఖరీఫ్ సాగు.. సగానికి తక్కువే!



పోతురెడ్డిపాలెం సమీపంలో వర్షాభావంతో బీటలు వారిన వరి వారుమడి

- వర్షాలు లేక నెమ్మదించిన వరి నాట్లు
- గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం
- పెట్టుబడి సాయంపై సర్కారు మౌనం
- నారు ముదిరి అదను దాటుతోందని రైతుల్లో ఆందోళన
- జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగువిస్తీర్ణం 74.775 హెక్టార్లు
- ఇప్పటివరకు సాగైంది 28.029 హెక్టార్లు



యలమంచిలి మండలం పోతురెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారి పక్కన సాగు మొదలుపెట్టని పంట భూములు

యలమంచిలి రూరల్: వరుణుడు ముఖం చాటేయడంతో జిల్లాలో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. భారీ వర్షాలు లేక వ్యవసాయ పనులు నెమ్మదించాయి. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటల సాగు విస్తీర్ణం 74,775 హెక్టార్లలో కాగా, అందులో ఇప్పటివరకు 28,029 హెక్టార్లలో(37 శాతం) మాత్రమే రైతులు సాగు చేశారు. ఇంకా 46,746 హెక్టార్లు సాగు చేయాల్సి ఉంది. మొత్తం పంటల్లో 53,121 హెక్టార్లలో వరి సాగు చేస్తారు. కానీ ఇప్పటివరకు కేవలం 21,226 హెక్టార్లలో(40శాతం) మాత్రమే సాగులోకి వచ్చింది. వరి నారుమళ్లు పోశాక 25 రోజుల్లో నాట్లు వేయాలి. కానీ జిల్లాలో కొన్ని చోట్ల 45 రోజులు దాటినా వర్షాలు కురవకపోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. మరికొన్ని చోట్ల వరి నారుమళ్లు ముదిరిపోయాయి. దీంతో గత్యంతరం లేక జిల్లాలో పలుచోట్ల మళ్లీ వరినారు మడులను వేశారు. పలువురు రైతులు వరినారుమడుల సాగు కోసం పెట్టిన పెట్టుబడి నష్టపోయారు. బోర్లు, చెరువుల కింద ఆయకట్టు భూముల్లో మాత్రమే కొందరు రైతులు ధైర్యం చేసి వరి నాట్లు వేస్తున్నారు. నాట్లు వేసిన తర్వాతైనా వర్షాలు కురుస్తాయన్న ఆశాభావంతో సాగు చేస్తున్నామని, వరుణుడు కరుణించకపోతే మొత్తం పెట్టుబడి నష్టపోవాల్సి వస్తుందన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు వారాల్లో వరినాట్లు పూర్తయితేనే ఆశించిన మేర దిగుబడి వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పుడిప్పుడే వరి నాట్లు జోరందుకున్నాయంటున్నాయని వ్యవసాయాధికారులు తెలిపారు

ఖరీఫ్ సాయం ఉఫ్..!

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటింది. జిల్లాలో ఈ సీజన్‌లో రైతులు ప్రధానంగా వరి సాగు ఎక్కువగా చేస్తారు. గత ఐదేళ్లు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద సీజన్ ప్రారంభానికి ముందే పంట పెట్టుబడి సాయం అందజేసింది. దీంతో అన్నదాతలు ఏ ఇబ్బందుల్లేకుండా సాగు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అధికారంలోకి వస్తే రూ.20 వేలు సాయం చేస్తామని ప్రకటించిన చంద్రబాబు ఆ దిశగా చర్యలేవీ తీసుకోకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు చిన్న, సన్నకారు రైతులు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద ప్రభుత్వ సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెలలు గడుస్తున్నా రూపాయి కూడా విదల్చకపోవడంతో అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

తడిసి మోపెడవుతున్న పెట్టుబడి

ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరా పొలంలో వరి సాగుకు రూ.20 వేలకు పైగా ఖర్చవుతుంది. దుక్కి దున్నడానికి ట్రాక్టర్‌కు గంటకు రూ.1500 కిరాయి ఇవ్వాలి. నాటేందుకు మహిళలకు రోజుకు రూ.300 నుంచి రూ.500, పురుషులకు రూ.800 చొప్పున కూలీ ఇవ్వాలి. ఎరువులు, క్రిమి సంహార మందులకు అధిక మొత్తంలో ఖర్చుచేయవలసి వస్తోంది.

ప్రభుత్వం ఆదుకోవాలి



వర్షాలు లేక వరి నారుమడులు ఎండిపోయేలా ఉన్నాయి. పెట్టుబడి సాయం గురించి ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఏ ప్రకటనా రాలేదు. ప్రభుత్వం నుంచి సాయం అందకపోతే ఇక సాగు చేయలేను. మళ్లీ ప్రైవేటు వ్యాపారుల నుంచి అప్పులు తీసుకోవాల్సిందే. ప్రభుత్వం ఆదుకోవాలి.

– కాళ్ల శ్రీనివాసరావు, రైతు, పోతురెడ్డిపాలెం, యలమంచిలి మండలం

నెలాఖరుకు 60 శాతం నాట్లు పూర్తి



జిల్లాలో ఈ నెలాఖరుకు 60 శాతం నాట్లు పూర్తవుతాయన్న నమ్మకం ఉంది. వర్షాధారంపై ఆధారపడి సాగు చేసిన వరి పంటకు వచ్చే రెండు వారాల్లో నీరు అవసరమవుతుంది. వర్షాభావ పరిస్థితులు నెలకొంటే తక్కువ పెట్టుబడి, నీటితో చిరుధాన్యాలు సాగు చేసుకోవచ్చు. ఈ నెలాఖరు తర్వాత ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తాం.

– బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

అయితే గోదావరి లేదంటే గరీబ్‌రథ్!

ఒడిశాకు తరలించేందుకు విశ్వప్రయత్నాలు

ఇప్పటికే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను భువనేశ్వర్‌కు తరలించుకుపోయిన ఈస్ట్‌కోస్ట్ రైల్వే.. ఇప్పుడు మరో రెండు రైళ్లపై దృష్టిసారించింది. రద్దీ లేదన్న అబద్ధపు ప్రచారంతో విశాఖ నుంచి బయలుదేరే రైళ్లను తమ ఖాతాలో వేసుకునేందుకు కుయుక్తులు పన్నుతోంది. అయితే గోదావరి.. లేదంటే గరీబ్‌రథ్‌ను ఎలాగైనా తమ ప్రాంతం నుంచి నడిచేలా ఒడిశా ప్రయాణికుల సంఘాలతో కలిసి పావులు కదుపుతోంది. ఆ రాష్ట్రానికి చెందిన కేంద్ర గిరిజన శాఖ మంత్రితో కలిసి రైల్వే మంత్రిపై ఒత్తిడి తీసుకొస్తోంది. ఈ రైళ్లు గుణుపూర్ నుంచి బయలుదేరేలా చర్యలు తీసుకోవాలంటూ ఒడిశా ప్రయాణికుల సంఘాలు వినతులు కూడా అందించాయి.

- ఆ రాష్ట్రానికి చెందిన కేంద్ర గిరిజన శాఖ మంత్రితో కలిసి మంతనాలు
- గుణుపూర్ నుంచి బయలుదేరేలా కేంద్ర రైల్వే మంత్రికి వినతులు
- ఇప్పటికే ప్రశాంతి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను పట్టుకుపోయిన ఈస్ట్‌కోస్ట్ జోన్
- విశాఖ నగర వాసుల ఆందోళన

రైలు - గోదావరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12727/12728)
ప్రయాణం- విశాఖ-సికింద్రాబాద్
ప్రారంభం- 1974 ఫిబ్రవరి

రైలు - గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739/12740)
ప్రయాణం- విశాఖ-సికింద్రాబాద్
ప్రారంభం- 2008 అక్టోబరు 25న



'పట్టు'వదలడం లేదు

గోదావరి ఎక్స్‌ప్రెస్ తరలించేందుకు ఈస్ట్‌కోస్ట్ జోన్ అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్న మాట వాస్తవమేనని కొందరు వాల్తేరు డివిజన్ అధికారులు చెబుతున్నారు. గతంలో వచ్చిన వ్యతిరేకత గురించి చెప్పినా ఏదో విధంగా పొడిగింపునకు ప్రయత్నిస్తామని పట్టుబడుతున్నారని సీనియర్ అధికారి వివరించారు. గోదావరి లేదంటే గరీబ్‌రథ్‌ను తీసుకెళ్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ ధరతో ప్రయాణికులను చేరవేస్తున్న గరీబ్‌రథ్ రైలుపై ఇప్పటికే రైల్వే బోర్డు అసంతృప్తిగా ఉందనీ.. ఈ నేపథ్యంలో దాన్ని పొడిగించేందుకు రైల్వే ఆసక్తిగా లేదని చెబుతున్నారు. ఇక మిగిలిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌పైనే ఒత్తిడి ఉందంటున్నారు. దీనిపై ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోకపోతే గోదావరి కూడా విశాఖ నుంచి తరలిపోయే ప్రమాదం ఉందని వాల్తేరు అధికారులు హెచ్చరిస్తున్నారు.

సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసినప్పటి నుంచి వాల్తేరు డివిజన్ నిర్వీర్యం చేసేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. విశాఖ రైల్వే స్టేషన్ ఆదాయాన్ని పూర్తిగా తగ్గించేసే విధంగా జోనల్ అధికారులు ఒక్కో అస్త్రాన్ని సంధిస్తున్నారు. గతంలో ప్రశాంతి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను భువనేశ్వర్ పట్టుకుపోయారు. పాసింజర్ రైళ్లను పొడిగించుకున్నారు. ఇప్పుడు వారి దృష్టి 50 ఏళ్ల చరిత్ర ఉన్న గోదావరిపై పడింది.

కుటిలయత్నాలు ఆరంభం : విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య అత్యధిక డిమాండ్ ఉన్న రైలు గోదావరి ఎక్స్‌ప్రెస్(12727/12728). ఎన్ని రైళ్లు వచ్చినా ఈ ఎక్స్‌ప్రెస్‌కు ఉన్న డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. 1974 ఫిబ్రవరిలో ఈ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు మొదలైంది. అప్పటి నుంచి ప్రతి రోజూ 100 శాతానికి పైగా ఆక్యుపెన్సీతో నడుస్తోంది. ఈ ఏడాది 50 ఏళ్లు కూడా పూర్తి చేసుకుంది. ఈ పరిస్థితుల్లో గోదావరిని దారి మళ్లించేందుకు కుటిల యత్నాలు మొదలయ్యాయి.

అబద్ధపు నివేదికలతో.. : ఇప్పటికే విశాఖ ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లను విశాఖ నుంచి భువనేశ్వర్‌కు పట్టుకుపోయారు. విశాఖ నుంచి బయలుదేరే ఈ రైళ్లన్నీ నిరంతరం ఫుల్‌గానే వెళ్లేవి. కానీ ఆక్యుపెన్సీ తక్కువగా ఉంటున్నాయంటూ అబద్ధపు నివేదికలతో ఆ రైళ్లను విశాఖ నుంచి భువనేశ్వర్ వరకు పొడిగించుకున్నారు. ఇప్పుడు గోదావరి ఎక్స్‌ప్రెస్‌పై వారి కన్ను పడింది. ఎనిమిదేళ్ల క్రితం కూడా గోదావరిని భువనేశ్వర్ నుంచి బయలుదేరాలా ఒడిశా అధికారులు తెరపైకి ప్రతిపాదనలు తీసుకొచ్చారు. అప్పట్లో ప్రజలు, ఇక్కడి అధికారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

గుణుపూర్ నుంచి అంట? : భువనేశ్వర్ నుంచి ప్రారంభించాలన్న ఆలోచనపై వ్యతిరేకత రావడంతో ఇప్పుడు గుణుపూర్ ప్రాంతాన్ని ఒడిశా వాసులు తెరపైకి తీసుకొస్తున్నారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను గుణుపూర్ నుంచి వైజాగ్ మీదుగా హైదరాబాద్ నడిపేలా షెడ్యూల్ ఫిక్స్ చేయాలంటూ గుణుపూర్ రైల్వే ప్రయాణికుల సంఘంతో పాటు ఆంధ్ర ఒడిశా రైల్వే ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఆ ప్రాంతానికి చెందిన కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్‌తో పాటు ఒడిశా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ని కలిసి గోదావరి ఎక్స్‌ప్రెస్ పొడిగింపుతో పాటు అనేక అంశాలతో కూడిన వినతి పత్రాల్ని అందించారు. గోదావరి ఎక్స్‌ప్రెస్ సాధ్యం కాకపోతే విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739/12740) అయినా గుణుపూర్ నుంచి మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

విశాఖ రేంజ్‌లో డీఎస్పీ, ఏసీపీల బదిలీ

అల్లిపురం: విశాఖ రేంజ్‌లో డీఎస్పీ, ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిస్‌మెంట్ బోర్డు సూచనల మేరకు బదిలీలు చేపట్టారు.

సంఖ్య	ఏసీపీ పేరు	పని చేస్తున్న స్థలం	బదిలీ అయిన స్థలం
1.	సీహెచ్.వివేకానంద	మహిళా పీఎస్, విశాఖపట్నం	ఎస్డీపీవో శ్రీకాకుళం
2.	బి.సునీల్	నార్త్ ఏసీపీ, విశాఖపట్నం	పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టింగ్
3.	ఎ.త్రినాథరావు	శ్రీకాకుళం, ఎస్టీ, డీఎస్పీ	డీఎస్ఆర్‌పీ, విశాఖపట్నం
4.	బి.మోహనరావు	డీఎస్ఆర్‌పీ, విశాఖపట్నం	కాకినాడ, ఏపీఎస్పీ 3వ బెటాలియన్
5.	ఎం.శ్రావణి	డీఎస్పీ, ఇంటిలిజెన్స్	ఎస్డీపీవో, అనకాపల్లి
6.	ఎస్.అప్పలరాజు	ఎస్డీపీఓ, అనకాపల్లి	పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టింగ్
7.	సీహెచ్.పెంటారావు	సీఐడీ, డీఎస్పీ	మహిళా పీఎస్, విశాఖపట్నం
8.	కె.ప్రభాకర్	డీఎస్పీ, డీటీసీ, ఏలూరు	ఏసీపీ, సిటీ స్పెషల్ బ్రాంచ్, విశాఖపట్నం
9.	ఎం.శ్రీనివాసరావు	సిటీ స్పెషల్ బ్రాంచ్, ఏసీపీ, విశాఖపట్నం అటాచ్డ్ డీటీసీ అనకాపల్లి	డీఎస్పీ, డీటీసీ అనకాపల్లి
10.	బి.మోసెస్ పాల్	ఏసీపీ, హార్బర్	పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టింగ్

నేడు యథావిధిగా వినతుల స్వీకరణ



కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)కార్యక్రమం సోమ వారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ వేదిక వద్ద ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. అన్ని విభాగాల జిల్లా అధికారులు అందుబాటులో ఉండి అర్జీలపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గోకులం.. చిత్తశుద్ధి శూన్యం

- గతంలో అమలుతీరు అయోమయం
- కొర్రీలు వేసి బిల్లులు ఇవ్వని వైనం
- ప్రయోజనం అంతంత మాత్రమే
- తాజాగా మళ్లీ అమలుకు చర్యలు
- అరకొరగా కేటాయింపులు
- కూటమి నేతలే తన్నుకుపోతారంటున్న అన్నదాతలు
- దరఖాస్తులకు మొగ్గు చూపని పాడి రైతులు

జిల్లాకు మంజూరైన యూనిట్లు : 750
మండలాలకు కేటాయింపు : 25 చొప్పున
పంచాయతీకి ఒక్కటి కూడా డౌటే

గోకులం...2018–19 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకం కేవలం ప్రచారార్భాటానికే పరిమితమైంది తప్ప పెద్దగా ప్రయోజనం చేకూరిన దాఖలాలు లేవు. నిర్మించిన షెడ్‌లకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కొందరు రైతులు అప్పులపాలయ్యారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని మళ్లీ అమలు చేసేందుకు చర్యలు చేపట్టడంతో ప్రభుత్వంపై నమ్మకం లేక ఎవరూ ముందుకు రావడం లేదు. అయితే తప్పనిసరిగా దరఖాస్తులు పంపాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తుండడం అధికారులకు తలనొప్పిగా మారింది.



దేవరాపల్లి పశువైద్య శాలలో గోకులం దరఖాస్తులు స్వీకరిస్తున్న పశువైద్య సిబ్బంది



పశువుల షెడ్డులో పాడి గేదెలు

గోకులం పశువుల షెడ్ల రాయితీ వివరాలు

పశువుల సంఖ్య	యూనిట్ విలువ	ఉపాధి నిధులు	రైతు వాటా
2	రూ.1,15,000	రూ.1,03,500	రూ.11,500
4	రూ.1,85,000	రూ.1,66,500	రూ.18,500
6	రూ.2,30,000	రూ.2,07,000	రూ.23,000

గొర్రెలు, మేకలు షెడ్ల రాయితీ వివరాలు

జీవాల సంఖ్య	యూనిట్ విలువ	ఉపాధి నిధులు	రైతు వాటా
20	రూ.1,30,000	రూ.91,000	రూ.39,000
50	రూ.2,30,000	రూ.1,61,000	రూ.69,000

కోళ్ల షెడ్ల రాయితీ వివరాలు

కోళ్ల సంఖ్య	యూనిట్ విలువ	ఉపాధి నిధులు	రైతు వాటా
100	రూ.87,000	రూ.60,900	రూ.26,100
200	రూ.1,32,000	రూ.92,400	రూ.39,600

దేవరాపల్లి: పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తామని చెబుతూ గోకులం పేరిట పశువుల షెడ్ల నిర్మాణ పథకాన్ని ప్రకటించిన ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా యూనిట్లు కేటాయించక పోవడంతో ఈ పథకం క్షేత్ర స్థాయిలో ఆదరణకు నోచుకోవడం లేదు. 2018–19 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అరకొరగా అమలుచేసింది. మళ్లీ దానిని ఇప్పుడు అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఈ పథకం అమలు తీరు 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా మారింది. ప్రచార ఆర్భాటం తప్ప చిత్తశుద్ధి కనబరచకపోవడంతో పాడి రైతులు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే ఎలాగైనా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పంపాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి అధికమవడంతో అధికారులకు ఈ పథకం తలనొప్పిగా మారింది.

పథకం అమలు ఇలా..

ఈ పథకం ద్వారా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి షెడ్ల నిర్మాణానికి రాయితీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పశు సంవర్ధకశాఖ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుండగా, ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేస్తారు. ఆవులు, గేదెల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70శాతం రాయితీ అందించనున్నట్లు ప్రకటించారు.

అరకొరగా కేటాయింపులు

జిల్లాకు 750 యూనిట్లు మంజూరు కాగా, వీటిలో మండలానికి కేవలం 25 యూనిట్లు చొప్పున మాత్రమే కేటాయించారు. దీంతో పంచాయతీకి ఒక్క యూనిట్ కూడా రాని పరిస్థితి నెలకొంది. మంజూరైన వాటిని అధికార పార్టీకి చెందిన వారు తన్నుకుపోతారని, తమకు ఇవ్వరని భావిస్తున్న రైతులు దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడంలేదు. అరకొరగా షెడ్లు కేటాయించడం వల్ల గ్రామాల్లో పాడి రైతుల నుంచి విమర్శలు ఎదుర్కోవలసి వస్తుందని కూటమి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం ఇవ్వని అధికారులు

ఈ నెల ప్రారంభం నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ పశు సంవర్ధకశాఖ అధికార్లు మాత్రం ఎక్కడా ఈ పథకంపై పాడి రైతులకు సమాచారం ఇవ్వలేదు సరికదా ఇటీవల వరకు దరఖాస్తులు స్వీకరించలేదు. అయితే తాజాగా రైతు సేవా కేంద్రాలు, పశువైద్య కేంద్రాలలో సైతం తప్పనిసరిగా దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేయాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

కొర్రీలతో మంజూరుకాని బిల్లులు

2018–19 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన గోకులం షెడ్లకు తాము చెప్పిన ప్రకారం నిర్మించ లేదన్న షాకుతో బిల్లులు చెల్లించలేదు. తాజాగా మంజూరు చేసిన గోకులం షెడ్లపై రైతులు ఆసక్తి చూపించకపోవడానికి ఇది ఒక కారణంగా తెలుస్తోంది.

ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వితంతువులకు, ఇతర సన్న చిన్నకారు రైతులకు ప్రాధాన్యతా క్రమంలో మంజూరు చేస్తారు. దరఖాస్తు చేసుకునే రైతుకు అప్లికేషన్‌తో పాటు ఆధార్‌కార్డు, జాబ్ కార్డు, భూమి హక్కు పత్రం, బ్యాంక్ ఖాతా పుస్తకం తప్పనిసరిగా ఉండాలి.

క్లుప్తంగా

'సెలవు రోజుల్లో కళాశాలలు నిర్వహించొద్దు'

అనకాపల్లి: ప్రభుత్వ సెలవు రోజుల్లో ప్రైవేట్ కళాశాలలను నిర్వహించడం తగదని, వాటి యాజమాన్యాలు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేయడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులో ఆదివారం ఓ కళాశాలలో తరగతులు నిర్వహించడంపై ఆయన ప్రశ్నించారు. విద్యార్థులను కళాశాల నుంచి బయటకు పంపించేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెలవు రోజుల్లో కళాశాలలు తెరిచి ఉన్న యాజమాన్యంపై జిల్లా అధికార యంత్రంగా తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. నిత్యం విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేయడం వల్ల తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ అనకాపల్లి డివిజన్ కార్యదర్శి నాగ రమణ, నాయకులు శివాజీ, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జతపాతం వద్ద ఆదివారం సందర్శకులతో జోష్ నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాట ఆడేందుకు పోటీ పడ్డారు. కాకినాడ, అనకాపల్లి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వాహనాలపై రావడంతో సరుగుడు రోడ్డులో సందడి నెలకొంది. ఇక్కడ జలపాతం వద్ద ఆటపాటలతో సందర్శకులు సాయంత్రం వరకూ ఉత్సాహంగా గడిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి ఉధృతి పెరగడంతో చిన్నాపెద్ద తేడా లేకుండా స్నానాలు చేశారు. తాండవ రిజర్వాయరు వద్ద గత వారంతో పోల్చుకుంటే ఆదివారం సందర్శకులు తాకిడి తగ్గింది.

మైనింగ్‌తో మానవ మనుగడకు ముప్పు

తగరపువలస: మానవ మనుగడకు హాని కలిగించే మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని మానవ హక్కుల వేదిక ప్రతినిధులు సూచించారు. ఆనందపురం మండలం కుసులవాడలో మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త వి.ఎస్.కృష్ణ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పి.రఘు, ప్రధాన కార్యదర్శి కె.అనురాధ ఆదివారం పర్యటించారు. పంచాయతీలోని గొల్లలపాలెం, చిన్నయ్యపాలెం, రామునేనిపేట, రేగానిగూడెం, బాకూరుపాలెం మైనింగ్ క్వారీలను సందర్శించారు. కొండలను ధ్వంసం చేయడం వలన ధ్వని, పర్యావరణ కాలుష్యంతోపాటు ఇళ్లకు ముప్పు పొంచి ఉంటుందన్నారు.

నిమ్మకు నీరెత్తినట్టు...

- పట్టించుకోని కూటమి నాయకులు
- శిథిలమైన ఆనకట్ట ప్రధాన గేట్లు
- కాలువ పూడిక తీయక నాతవరం రైతుల అవస్థలు



నాతవరం మండలంలో పూడికతో ప్రధాన కాలువ



పూడిక తీసిన కోటనందూరు వెళ్లే ప్రధాన కాలువ



శిథిలమైన నిమ్మకట్టు ఐరన్ గేట్లు

నాతవరం: ఖరీఫ్ సాగుకు జీవనాధారమైన నిమ్మకట్టుపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. దాంతో రెండు మండలాల ఆయకట్టుదారులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాజుపేట అగ్రహారం సమీపంలో తాండవ ప్రాజెక్టు కింద భాగంలో బ్రిటిష్ హయాంలో నిమ్మకట్టు (ఆనకట్ట) నిర్మించారు. తాండవ ప్రాజెక్టుతో పని లేకుండా ఆనకట్ట ద్వారా ఏటా ఖరీఫ్‌లో నాతవరం మండలంతోపాటు కాకినాడ జిల్లాలో కోటనందూరు మండలంలో వేలాది ఎకరాలకు సాగు నీరు సరఫరా అయ్యేది. మండువేసవిలోనూ సాగునీరు పుష్కలంగా ఉండటంతో పశువులకు దాహార్తి తీరేది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో ఆనకట్ట ప్రధాన గేట్లు శిథిలమయ్యాయి. వీటికి మరమ్మతులుగానీ కొత్తవి ఏర్పాటుగానీ చేయలేదు. దాంతో సాగునీరంతా వృథాగా పోతోంది. ఆయకట్టుకు నీరు ప్రవహించే కాలువలో పూడిక తీత పనులు చేయలేదు. దాంతో కాలువను కప్పేసి పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.

స్థానిక కూటమి నాయకులకు శ్రద్ధేదీ?

నాతవరం మండలంలో రాజుపేట అగ్రహారం, లింగంపేట, మన్యపురట్ల, గన్నవరం, వై.బి.పట్నం, కొత్త రామచంద్రపురం, బుచ్చెంపేట, మాసయ్యపేట, గన్నవరంమెట్ట, వై.బి.అగ్రహారం, కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో అల్లిపూడి, లక్ష్మీపురం, కోటనందూరు, భీమవరపుకోట, కాకరాపల్లి, జగన్నాథపురం, ఎస్.ఆర్.పేట తదితర గ్రామాలకు నిమ్మకట్టు నీరు పారుతోంది. కాలువలో పూడిక తీయకపోవడంతో నీరు శివారు ఆయకట్టుకు ప్రవహించలేదు. అధికారుల దృష్టికి పలుమార్లు రైతులు తీసుకెళ్లినా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో ఏటా వేసవిలో ఇరిగేషన్ శాఖ అధికారులు కాలువలో పూడిక తీత పనులు చేసేవారని, ఈ ఏడాది చేయలేదని రైతులు వాపోతున్నారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలానికి ప్రవహించే కాలువను ఉపాధి హామీ పథకంలో పూడిక తీత పనులు చేసి శుభ్రం చేసుకున్నారు. అక్కడ అధికారులు, నాయకులు సంయుక్తంగా పంట కాలువలు బాగు చేసుకునేందుకు దృష్టి సారించారు. కోటనందూరు మండలంలో శివారు ఆయకట్టుకు సైతం నీరు పుష్కలంగా అందుతోంది. నాతవరం మండలంలో అధికారులు, నాయకులు ఇక్కడ కాలువల దుస్థితిపై కన్నెత్తి చూడలేదు. ఐరన్ గేట్లు శిథిలం కావడంతో నిత్యం లీకేజీ ద్వారా నీరంతా వృథాగా పోతుందని ఆయకట్టుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ జేఈశ్యామ్‌కుమార్‌ను సంప్రదించగా కాలువలో పూడిక తీత పనులు చేసేందుకు రూ.10 లక్షల ప్రతిపాదనలు చేశామన్నారు. నిధులు వచ్చాక రైతులు సాగు నీరుకు ఇబ్బందిలేకుండా పనులు చేస్తామన్నారు.

బొజ్జన్నకొండ రోడ్డులో అంధకారం

చోరీకి గురవుతున్న సోలార్ విద్యుత్ దీపాలు



బొజ్జన్నకొండ రోడ్డులో దొంగిలించిన సోలార్ విద్యుత్ దీపాలు

తుమ్మపాల: బొజ్జన్నకొండ రోడ్డులో చీకటిని జయించి వెలుగులు ప్రసాదిస్తున్న సోలార్ విద్యుత్ దీపాలు చోరీకి గురవుతున్నాయి. మండలంలో శంకరం –తుమ్మపాల గ్రామాల మధ్య పురాతన పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండకు వెళ్లే రోడ్డు పొడవునా ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ బీవీ సత్యవతి ప్రత్యేక నిధులు వెచ్చించి సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. బొజ్జన్నకొండ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.2 కోట్లతో 3.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఇక్కడ అభివృద్ధిపైనా సోలార్ విద్యుత్ దీపాలుపైనా కనీసం దృష్టి పెట్టకపోవడంతో చోరీకి గురవుతున్నాయి. నిత్యం వాహనాలు రాకపోకలు సాగించే ఇక్కడ రహదారిలో 20 అడుగుల ఎత్తున ఉండే సోలార్ దీపాలు పోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటుగా క్వారీ లారీలు అధికంగా తిరుగుతున్నాయని, అర్ధరాత్రి సమయాల్లోనే దీపాలు దొంగిలిస్తున్నారని చెబుతున్నారు. ఈ రోడ్డుపై రోజూ తెల్లవారు, సాయంత్రం సమయాల్లో వాకింగ్, ఎక్సర్‌సైజ్‌లు చేసేవారికి విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కూటమి నాయకులు, అధికారులు దృష్టిసారించి చోరీపై విచారణ చేయాలని, కొత్త దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జై భారత్ జిల్లా కమిటీల ఎన్నిక



జై భారత్ నూతన కార్యవర్గం

కోటవురట్ల: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జై భారత్ అనకాపల్లి జిల్లా నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జై భారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నోట్లకు మద్యానికి ఓటును అమ్ముకునే వ్యక్తి పశువుతో సమానం అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా జై భారత్ పని చేస్తుందన్నారు. నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా యాసరపు అర్జున్‌రావు, ఉపాధ్యక్షుడిగా డి.సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల సత్యనారాయణ, కార్యదర్శిగా ఎస్.కె. జిలానీ, కార్యదర్శిగా జి.లోవలక్ష్మి, జై భారత్ సామాజిక విప్లవ రణభేరి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా పిల్లి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా దూలపల్లి నాగేశ్వరరావు, జిల్లా జై ఎస్సీ పోరాట వేదిక అధ్యక్షుడిగా– కోన యేసురత్నం, ప్రధాన కార్యదర్శిగా పరవాడ రామకృష్ణ, జిల్లా జై భారత బీసీ పోరాట వేదిక అధ్యక్షుడిగా పత్తి రమణ, ఉపాధ్యక్షుడిగా తీడ ప్రసాద్, జిల్లా జై భారత్ ఎస్టీ పోరాట వేదిక అధ్యక్షుడిగా మట్టా చినబాబు, ప్రధాన కార్యదర్శిగా గోటిమళ్ల రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి జీవీ రమణ, జై భారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖదిజ్ఞాసి త్రిమూర్తులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోన బాబూరావు, దాసరి వెంకట్రావు, రాష్ట్ర సమితి సభ్యులు పిట్టా శ్రీనివాస్, జి.సత్యనారాయణ, కృష్ణ ప్రసాద్, మట్ల గణేష్, జంగా ప్రసాద్ పాల్గొన్నారు.

పటిక బెల్లంతో హోం మంత్రి తులాభారం



అప్పన్న ఆలయంలో తులాభారంలో పటిక బెల్లం సమర్పిస్తున్న వంగలపూడి అనిత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మెట్ల మార్గంలో నడిచి సింహగిరికి చేరుకుని, తులాభారం కింద స్వామికి పటిక బెల్లం సమర్పించారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆమె పేరుతో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి జ్ఞాపిక, ప్రసాదాన్ని ఈవో శ్రీనివాస మూర్తి ఆమెకు అందజేశారు.

హైకోర్టు న్యాయమూర్తితో మర్యాదపూర్వక భేటీ



హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖ బ్రతబాగ్చి

మహారాణిపేట: జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం విశాఖ విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హారితో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. స్థానిక గ్రీన్ పార్క్ హోటల్‌లో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంతకు ముందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కనుల పండువగా నృత్య పండగ



డ్యాన్స్ ప్రదర్శించిన చిన్నారులతో సినీనటి రాగిణి, నిర్వాహకురాలు విజయమాధవి

మద్దిలపాలెం(విశాఖ): కళాభారతి ఆడిటోరియంలో విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ(హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించిన డ్యాన్స్, మ్యూజిక్ ఫెస్టివల్ కనుల పండువగా సాగింది. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి నిర్విరామంగా జరిగింది. రాయ్‌పూర్, కాకినాడ, రాజమండ్రి, అన్నవరం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి 250పైగా చిన్నారులు పాల్గొని వివిధ పాటలకు అద్భుతంగా నాట్యం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి రాగిణి మాట్లాడుతూ ఇంత గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు విజయమాధవి మాట్లాడుతూ విశాఖ కళలకు పుట్టినిల్లు వంటిదని.. ఇక్కడ విజయవంతంగా కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. స్నేహాంజలి ఆర్ట్స్ చిన్నారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సినీ నటులు సుమన శ్రీ, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులతో కలిసి అతిథులు చిన్నారులకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలను బహూకరించారు.

కనకమహాలక్ష్మి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల వేద ఆశీర్వచనం అనంతరం ఆమెకు ఏఈవో రాంబాబు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ప్రాణాలు పోసే వైద్యులకే రక్షణ లేదా?

బీచ్‌రోడ్డులో జూనియర్ వైద్యుల నిరసన



ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద నిరసన జూనియర్ వైద్యులు

మహారాణిపేట: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, అనంతరం హత్య ఘటనను నిరసిస్తూ ఆదివారం బీచ్‌రోడ్డులో వందలాది మంది వైద్యులు, నర్సులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర జూనియర్ వైద్యుల సంఘం పిలుపు మేరకు నిర్వహించిన ర్యాలీలో పలు ఆస్పత్రుల వైద్యులు, నర్సులు నల్ల బ్యాడ్జీలు, టీషర్టులు ధరించి నిరసన తెలిపారు. బీచ్‌రోడ్డు కాళీమాత ఆలయం వద్ద మొదలైన ర్యాలీ వైఎంసీఏ వరకు చేరి, తిరిగి కాళీమాత ఆలయం వద్దకు చేరుకుని ముగిసింది. వైద్యులు నినాదాలు చేస్తూ, ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని, చట్టాలను మార్పు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ హోమియో వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.రాఘవేంద్రరావు, శ్రీకాంత్, చంద్రశేఖర్, శీటల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆందోళన : కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన విషాద ఘటనకు నిరసనగా జూనియర్ వైద్యులు చేస్తున్న ఆందోళన ఆదివారం కొనసాగింది. ఆరు రోజుల నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ఎదుట నిరసన తెలిపారు. కేజీహెచ్‌లో ఓపీలు, వార్డులకు హాజరుకాకుండా విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఆందోళనలో భాగంగా సోమవారం కేజీహెచ్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దీక్షలో పాల్గొంటామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ, ఇతర వైద్య సంఘాలను ఆహ్వానించామన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

నేడు సుప్రీంకోర్టు జడ్జి పర్యటన

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాన్ని(డీఎస్ఎన్ఎల్‌యూ) సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి, విశ్వవిద్యాలయ పూర్వ కులపతి జస్టిస్ జె.కె.మహేశ్వరి సందర్శించనున్నారు. వర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు ఈ వివరాలు వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటెలెక్చువల్ ప్రాపర్టీస్ చైర్‌ను మధ్యాహ్నం 2.30 గంటలకు జస్టిస్ మహేశ్వరి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం న్యాయ విద్యార్థులనుద్దేశించి 'న్యాయవాద వృత్తి–న్యాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలల పాత్ర' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తారన్నారు. విశ్వవిద్యాలయాలకు వచ్చే ర్యాంకుల్లో ప్రస్తుతం వర్సిటీకి 39వ ర్యాంకు వచ్చిందని, ఈ ర్యాంకును మరింత మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. వర్సిటీలో త్వరలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సును ప్రారంభిస్తామన్నారు. ఈ కోర్సుకు సంబంధించిన ప్రవేశాలకు జాతీయస్థాయిలో ఈ నెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య నందిని, ఎగ్జామినేషన్ డీన్ బి.సోమ, పీఆర్వో విశ్వచంద్ర పాల్గొన్నారు.

సాగరతీరంలో హిందూ ఐక్యతా ర్యాలీ



ర్యాలీలో హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు

బీచ్‌రోడ్డు: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ.. సాగరతీరంలో ఆదివారం హిందూ ఐక్యతా ర్యాలీ జరిగింది. హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ర్యాలీలో పలువురు మాట్లాడారు. బంగ్లాదేశ్‌లోని హిందువుల కోసం భారత్‌లోని హిందువులందరూ ఒక తాటిపైకి రావాలన్నారు. పార్టీలు, కులాలకు సంబంధం లేకుండా తోటి హిందువులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

శభాష్ పోలీస్

- ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని రక్షించిన వన్‌టౌన్ పోలీసులు



ఉదయ్‌కుమార్‌తో కానిస్టేబుల్ రామకృష్ణారెడ్డి

అల్లిపురం: భార్యభర్తల గొడవల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు రక్షించారు. తన భర్త నేపాకి ఉదయ్‌కుమార్ తాగివచ్చి ఇబ్బంది పెడుతున్నాడని కందులవారి వీధికి చెందిన వరలక్ష్మి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. ఆమె వెనుకనే వచ్చిన ఉదయ్ కుమార్..తనతోపాటు ఇంటికి రమ్మని భార్యను పిలిచాడు. అయితే వరలక్ష్మి వెళ్లేందుకు ఇష్టపడలేదు. దీంతో ఇంటికి వెళ్లిపోయిన ఉదయ్‌కుమార్..ఇంట్లో సమస్యల కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సోదరి భవానికి ఫోన్ చేసి చెప్పాడు. కంగారుపడిన భవాని వెంటనే వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పింది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే బ్లూకోట్స్ కానిస్టేబుల్ జి.రామకృష్ణారెడ్డికి తెలియపరిచారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ తులుపులు విరక్కొట్టి అప్పటికే ఫ్యాన్‌కి ఉరివేసుకుంటున్న ఉదయ్‌కుమార్‌ను కాపాడి పోలీసు స్టేషన్‌కు తరలించారు. భార్యభర్తలిద్దరికీ సీఐ బి.భాస్కరరావు కౌన్సెలింగ్ నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించిన పోలీసులను స్థానికులు అభినందించారు.

ఇంట్లో మనుషులుండగానే చోరీలు

ఈ ఘరానా దొంగ తీరే వేరు

- రాత్రి పూట దొంగతనాలు చేస్తున్న పాత నేరస్తుడు అరెస్ట్
- అతనికి సహకరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రూ.7.40లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఓ బైక్ స్వాధీనం



మాట్లాడుతున్న నగర క్రైం డీసీపీ పి.వెంకటరత్నం

అల్లిపురం: రాత్రి సమయంలో, ఇంట్లో మనుషులుండగానే చోరీలకు పాల్పడుతున్న బాలబోయిన రమేష్ అలియాస్ విక్రమ్‌తో పాటు కోటా రఘునాథ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7.40 లక్షల విలువైన 77 గ్రాముల బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఆదివారం క్రైం డీసీపీ పి.వెంకటరత్నం ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 26న మురళీనగర్ దరి అయ్యప్పనగర్ ప్రాంతంలో గొట్టిపాటి రఘురాం తన ఇంట్లో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో దొంగ ప్రధాన ద్వారం తలుపు గడియను విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. రఘురాం నిద్రిస్తున్న గదిలో కాకుండా పక్క గదిలోకి వెళ్లి.. అక్కడే ఉన్న తాళాలతో బీరువాను తెరిచాడు. అందులో గల సుమారు 25 తులాల బంగారు ఆభరణాలను దొంగలించాడు. ఈ ఘటనపై కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఘటనా స్థలంలో దొంగ చేతి వేలి ముద్రలను సేకరించారు. సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎస్. శ్రీనివాసరావు, సీసీఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడ్డారు. నిందితుడి వేలిముద్రల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి.. పాత నేరస్తుడైన కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన బాలబోయిన రమేష్ అలియాస్ విక్రమ్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అతనికి సహకరించిన మరో నిందితుడు కృష్ణా జిల్లా నందిగామకు చెందిన కోటా రఘునాథ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 77 గ్రాముల బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రమేష్‌ను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులతో పాటు సీసీఎస్ ఏఎస్ఐ పి.చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ జీవీఎస్‌కే రెడ్డి, కానిస్టేబుల్ ఎన్.అప్పలరాజు, కె.అగస్త్యస్‌లను సీపీ తరపున ఆమె అభినందించారు.

రమేష్‌పై 31 కేసులు : ప్రధాన నిందితుడు రమేష్‌పై ఎంవీపీ కాలనీ, కంచరపాలెం, ఆరిలోవ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 11 ఇంటి దొంగతనాల కేసులు నమోదయ్యాయి. గుంటూరు, కృష్ణా, ఒంగోలు, నందిగామ ప్రాంతాల్లో మరో 20 కేసులు నమోదయ్యున్నట్లు క్రైం డీసీపీ తెలిపారు. కొన్ని కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించాడు. జైలులో కోటా రఘునాథ్‌తో పరిచయం పెంచుకున్న రమేష్.. జైలు నుంచి విడుదలైన తర్వాత శీలానగర్ దరి గొల్ల జగ్గరాజుపాలెం వద్ద ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. దొంగతనం చేసిన డబ్బుతో ఎంజాయి చేయడం హాబీగా మార్చుకున్నాడు. జూదంతో పాటు తరచూ గోవా వెళ్లేవాడని పోలీసులు గుర్తించారు. రాత్రి పూట ఇంటి ప్రధాన తలుపులు, ముఖ్యంగా కిటికీ పక్కన తలుపులు ఉండే ఇళ్లల్లో దొంగతనాలు చేయడంలో రమేష్ సిద్ధహస్తుడు.

నగర ప్రజలకు డీసీపీ విజ్ఞప్తి : రాత్రి సమయాల్లో బయటకు వెళ్లినప్పుడు ఇంటి ప్రధాన తలుపులకు, ఇనుప గ్రిల్ గేటుకు తాళాలు వేసుకోవాలని డీసీపీ ప్రజలకు సూచించారు. ముఖ్యంగా కిటికీ పక్కన గల తలుపులకు పైన, మధ్య, కింది గెడలను తప్పనిసరిగా వేయడంతో పాటు కిటికీల గెడలు వేసుకోవాలన్నారు. గాలి కోసం ప్రధాన తలుపు వద్ద గల కిటికీలు తెరిచి ఉంచొద్దన్నారు. ఇంటి తాళాలు, బీరువా తాళాలను దుస్తుల కింద, గోడల మీద, షూల్లో పెట్టవద్దన్నారు. విలువైన వస్తువులు ఉంటే వీలైనంత వరకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

EDUCATION
■ Study from home. Online Degree, PG, Diploma, B.Tech, BBA, MBA, MCA etc. Courses admissions going on. Guarantee pass. Eligible for all jobs. Ph: 79972 96796 [V- 120119]

Real Estate

FLAT FOR SALE
■ Luxury 3 Bed Room Flats for sale, Yendada Main Road South 1510 Sq.ft. 2 Road corner. Rate 78 Lakhs including amenities. Ph : 79893 44212 [V- 12501]

PLOT FOR SALE
■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలతో చ॥గ॥ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర: ✆ 7731076666 [B-54]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

Wanted
■ బైక్ రైడ్స్‌తో సంపాదన పక్కా..! రూ.2000/- day. మన విశాఖ మరియు పరిసర ప్రాంతాలలో, బెనిఫిట్స్: P/F జాబ్, 0% కమీషన్, 25% కొత్త రేట్ కార్డు, డైలీ/వీక్లీ ఇన్సెంటివ్స్, 5 లక్షల వరకు ఇన్సూరెన్స్. ఫోన్: 73962 67109 / 040-48987612. [V- 12507]

■ Wanted Male Administrative Officers Qualification Any Degree, Age Limit: 25 to 45 years. Salary upto: 15000/- to 20000/-. Location: Gajuwaka. Contact: 80085 56073, 80085 57071. [G-5628]

■ ప్రముఖ సంస్థలో పని చేయుటకు Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం + PF + ESI, ప్రదేశం: Vizag. సంప్ర: ✆ 87126 36579 [B-381]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K, ఫోన్ : 9160900024, 9640400073 [H-796267]

■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయటానికి కార్గో సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, క్యాబ్ డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 28000 నుంచి 34000 రూము+ భోజనం ఫ్రీ. Ph: 7093769794 [H-778942]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

ఈ గుర్తింపుతో 'కౌలు'కునేనా!

గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో సేద్యం జరిగి, పంట ఉత్పత్తులు పెరుగుతున్నాయంటే అందుకు కారణం కౌలు రైతులే. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంట నష్టపరిహారం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో రాయితీకి మాత్రం వీరు అర్హులు కారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీరిని కూడా సాగు ఒప్పందం ఆధారంగా ప్రభుత్వ పరిహారాలకు అర్హుల్ని చేశారు. ప్రస్తుతం కౌలు కార్డులు మంజూరు చేస్తున్నారు. అనకాపల్లి మండలంలో 250 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరయ్యాయి. వీటితోనైనా కౌలు రైతుల కష్టాలు తీరాలని ఆశిద్దాం.

- కౌలు రైతులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు
- మండలంలో 250 మంది కౌలు రైతులకు మంజూరు
- ఇప్పటి వరకు 165 మందికి కార్డుల పంపిణీ
- పంట నష్ట పరిహారం, రాయితీకి వెసులుబాటు



తుమ్మపాలలో ఎకరం పొలాన్ని సాగుచేస్తున్న కౌలు రైతు నర్సింగరావు


అనకాపల్లి: మండల పరిధిలో ఈ ఏడాది 5,600 ఎకరాల్లో రైతులు, కౌలు రైతులు వరినాట్లు వేస్తున్నారు. విపత్తుల కారణంగా పంటకు నష్టం వాటిల్లితే సొంత పొలం ఉన్న రైతులకు ప్రభుత్వం ఎంతో కొంత నగదు సాయం అందిస్తుంది. కౌలు రైతులకు మాత్రం నిరాశే. సాధారణ రైతు మాదిరే కౌలు రైతుకు పంటనష్టం ఇచ్చేందుకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేస్తోంది. ఈ మేరకు వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టారు. మండల పరిధిలో ఈ ఏడాది 250 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 165 మందికి పంపిణీ చేశారు.

కొత్త చట్టంతో మార్గ సుగమం

సొంత భూమిలేని కౌలు రైతులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు అంజేస్తోంది. భూ యాజమానులకు వారి భూమిపై ఉన్న హక్కుకు ఎలాంటి భంగం వాటిల్లకుండా 1956 రక్షిత కౌలుదారీ చట్టాన్ని రద్దు చేసి 2019లో కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ చట్టంలో భూ యాజమానులు హక్కుల రక్షణతోపాటు, వాస్తవంగా సాగు చేసే కౌలు రైతులకు పరిహారం, రాయితీ, పంట రుణం పొందేందుకు వీలుగా సాగుదారు కార్డులు మంజూరు చేసేందుకు వీలు కల్పించారు. ఇది కౌలు రైతులపాలిట వరంగా మారింది. ప్రస్తుతం సాగు హక్కు పత్రాలు పొందిన కౌలు రైతులు వ్యవసాయశాఖ ద్వారా వచ్చే అన్ని రాయితీలు నేరుగా పొందుతున్నారు. ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందే వెసులుబాటు కలుగుతుందని అధికారులు చెప్తున్నారు. ఆచరణలో ఇది ఏ మేరకు కార్యరూపం దాల్చుతుందో చూడాలి.

సాగు కార్డు పొందాలంటే..

- కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యాజమానితో 11 నెలల సాగు ఒప్పందం చేసుకోవాలి.
- భూ యజమాని పాస్‌బుక్/1బీ జెరాక్స్, ఆధార్ కార్డు సాగుదారునికి ఇవ్వాలి.
- కౌలు రైతుకు ఎటువంటి భూమి ఉండకూడదు.
- భూ యజమాని(రైతు) ఇచ్చిన పాస్‌బుక్, ఆధార్‌కార్డు, 11 నెలల ఒప్పంద పత్రాలతో పాటు కౌలురైతు ఆధార్‌కార్డు, ఫొటోను వీఆర్వోకు అందిస్తే, వారు కౌలు రైతుకు గుర్తింపు కార్డు మంజూరు చేస్తారు.
- దీంతో ఈ పంట నమోదులో భూ యజమాని స్థానంలో కౌలు రైతు వివరాలు నమోదుకు వీలవుతుంది.



కౌలురైతు గుర్తింపు కార్డు

- విపత్తుల వలన పంటనష్టం వాటిల్లితే తాను సాగు చేసే భూమికి ప్రభుత్వం నుంచి కౌలు రైతు పరిహారం పొందవచ్చు.
- కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిహారం రైతుకు, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది కౌలు రైతుకు చేరుతుంది.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ వ్యవహారమంతా రైతు భరోసా కేంద్రాల్లో జరిగేది. ప్రస్తుత ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరిట కార్డులు మంజూరు చేస్తోంది.
- కౌలు రైతుకు 11 నెలల తర్వాత ఆ భూమిపై ఎలాంటి హక్కూ ఉండదు. కొనసాగాలంటే మళ్లీ ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాలి.

నాకూ కార్డు వచ్చింది



కౌలుదారు గుర్తింపు కార్డుతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. గతంలో పంట నష్టపోతే పరిహారం అందేది కాదు. భూ యజమాని దయతలచి ఇస్తే సరి, లేకుంటే అంతే. ఇప్పుడు రాయితీ విత్తనాలు, ఎరువులు మాక్కూడా వస్తాయి. వర్షాలు, కరువుల వల్ల పంట నష్టపోతే పరిహారం కూడా మా బ్యాంకు ఖాతాకే వేస్తారట. కౌలు సాగుకు కాస్త ఆసరా దొరికినట్టయింది.

– విల్లూరి మోదినాయుడు, రైతు, తుమ్మపాల, అనకాపల్లి

11 నెలలే చెల్లుబాటు



మండలంలో ఇప్పటి వరకు 165 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చాం. రైతు, కౌలు రైతుల ఒప్పందం మేరకు స్థానిక వీఆర్వో ద్వారా గుర్తింపు కార్డులు అందిస్తున్నాం. ఈ గుర్తింపు కార్డు 11 నెలలు మాత్రమే చెల్లుబాటులో ఉంటుంది. సాగు హక్కుకు తప్ప భూమిపై కౌలు రైతులకు ఎలాంటి హక్కు ఉండదు. దరఖాస్తు చేసుకోని వారు వెంటనే చేసుకోండి.

– పి.రంగాచారి, మండల వ్యవసాయాధికారి, అనకాపల్లి

క్లుప్తంగా

రక్షాబంధన్ సందడి



కశింకోటలో రాఖీల విక్రయం

కశింకోట: రక్షాబంధన్ సందర్భంగా రాఖీల అమ్మకాలు ఆదివారం జోరందుకున్నాయి. సోమవారం అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగ. దీంతో పలు దుకాణదారులు రాఖీల విక్రయాలకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. దీంతో పిల్లలు, మహిళలు కొనేందుకు ఎగబడ్డారు. వివిధ ఆకారాల్లో సైజు, నాణ్యత ఆధారంగా రూ.10 నుంచి రూ.200కు పైగా విక్రయాలు సాగాయి. దుకాణాల వద్ద సందడి నెలకొంది. మండల గ్రామాల్లో కూడా దుకాణాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగాయి.

వచ్చే నెల 1న మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద సెప్టెంబర్ 1న గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా 3,500 మట్టి గణపతి విగ్రహాలు, వినాయక వ్రత కథ పుస్తకం, పసుపు, కుంకుమలు పంపిణీ చేయనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్లబ్ ద్వారా పదేళ్లుగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి ప్రతిమలను అందిస్తున్నామన్నారు. మట్టి విగ్రహాలనే పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రెండో రోజూ వైద్య సేవలు బంద్



కశింకోట పీహెచ్‌సీలో అత్యవసర సేవల కోసం ఉన్న స్టాఫ్ నర్స్

కశింకోట: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటనకు నిరసనగా రెండో రోజు ఆదివారం కూడా వైద్య, ఆరోగ్య సిబ్బంది విధులను బహిష్కరించారు. కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీల వైద్య, ఆరోగ్య సిబ్బంది సాధారణ విధులకు గైర్హాజరయ్యారు. స్టాఫ్ నర్సులతో అత్యవసర సేవలను మాత్రం కొనసాగించారు. రెండు రోజులుగా సాధారణ వైద్య సేవలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందిపడ్డారు. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చిందని వాపోయారు.

కృష్ణాష్టమి ఉత్సవాలు ప్రారంభం

కశింకోట: స్థానిక కోనేటి పార్కు వద్దనున్న శ్రీకృష్ణ మందిరంలో యశోదకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవర వీధి నుంచి శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి మందిరంలో నెలకొల్పారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 26న జరిగే కృష్ణాష్టమి వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. రోజూ పూజలతోపాటు భజనలు, విశేష సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	పర్తిసాయి
డార్లింగ్	షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	శ్రీసత్య
డబుల్ ఇస్మార్ట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 258 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 237 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

దంచి కొట్టిన వాన



కశింకోటలో కురుస్తున్న వర్షం

తుమ్మపాల: మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మబ్బులు పట్టి, చీకటి మయంగా మారింది. భారీ ఈదురు గాలులతో ప్రారంభమైన వర్షం సుమారు గంటపాటు దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఎక్కడికక్కడ రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు దగ్గరలో తలదాచుకునేందుకు వాహనాలను రోడ్డుపైనే వదిలి పరుగులు తీశారు. కొన్ని చోట్ల చెట్లు నేలకొరిగాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవాహంలా మారింది. ఎండుతున్న వరినారుకు ఈ వర్షం జీవం పోస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వరి పంటలపై నమ్మకాన్ని కోల్పోతున్న రైతుల్లో ఆశలు చివురించాయి. మండలంలో ఇటీవల విరివిగా వేసిన సరుగుడు, యూకలిప్టస్ మొక్కలకూ ఈ వర్షంతో ప్రాణం పోసినట్టయింది. అయితే దమ్ములకు సరిపడా వర్షం కురవాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

కశింకోట: ఆదివారం సాయంత్రం కశింకోటలో మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మండుతున్న ఎండకు ఇబ్బంది పడ్డ ప్రజలకు సాయంత్రం చల్లని ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రధానంగా పెళ్లిళ్ల సీజన్ కావడంతో కల్యాణ మండపాల్లో కాకుండా ఇళ్ల వద్ద వివాహాలు పెట్టుకున్న వారు వేదికలు, షామియానాలు తడిసి ఇబ్బందిపడ్డారు. మండల గ్రామాల్లో కూడా చిన్న పాటి వర్షం కురిసింది.

సీఐ వినోద్‌బాబు బదిలీ

కశింకోట: స్థానిక సీఐ ఎం.వినోద్‌బాబు బదిలీ అయ్యారు. ఆయన్ని వీఆర్‌లో ఉంచారు. ఆ స్థానంలో వీఆర్‌లో ఉన్న స్వామినాయుడుని సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆదివారం తెలిసింది. ఇంకా బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. స్వామినాయుడు గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేశారు. సీఐగా పదోన్నతి పొంది అనకాపల్లి ట్రాఫిక్‌లో విధులు నిర్వర్తించారు. వీఆర్ నుంచి ఇప్పుడు సీఐగా మళ్లీ కశింకోట రానున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల ముందు సీఐ స్టేషన్‌గా కశింకోటను అప్‌గ్రేడ్ చేయడంతో ఈ ఏడాది జనవరిలో శ్రీకాకుళం నుంచి వినోద్‌బాబు బదిలీపై వచ్చారు. అనతి కాలంలోనే ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. ఇక్కడి ఎస్ఐ రమేష్‌బాబు గత నెలాఖరున పదవీ విరమణ చేయడంతో విశాఖ సిటీలో పనిచేసే ఎస్ఐ వి.ప్రసాదరావును ఆ స్థానంలో నియమించారు.

'కౌశిక' కు అభినందన

పరవాడ: తానాం గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్.కౌశిక యోగాలో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించింది. ఈ నేపథ్యంలో ఆగస్ట్ 15న మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జెండావందన కార్యక్రమంలో హోం మంత్రి అనిత, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆమెను అభినందించారు. కొణతాల ఆమెకు రూ.10వేలు నగదు ప్రోత్సాహకం అందించారు. కౌశిక తల్లి ఆదిలక్ష్మి గృహిణి కాగా, తండ్రి సత్యనారాయణ కారుడ్రైవర్‌గా పని చేస్తున్నారు.

కోల్‌కతా ఘటనపై ఐద్వా నిరసన

పరవాడ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అతి కిరాతకంగా అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. కోల్‌కత్తా ఘటనకు నిరసనగా ఐద్వా సభ్యులు గొర్లివానిపాలెం వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు మాణిక్యం మాట్లాడుతూ ప్రాణాలు పోసే వైద్యులకు భరోసా కరువైందన్నారు. మహిళలకు కనీస రక్షణ లేకుండా పోయిందనడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలన్నారు. వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి చంపిన కిరాతకులను కఠినంగా శిక్షించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కోల్‌కతా డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలి



జూనియర్ డాక్టర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితుల్ని తక్షణమే అరెస్టు చేసి, వైద్యురాలి కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో మృతురాలికి ఆదివారం శ్రద్ధాంజలి ఘటిస్తూ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ 'బేటీ బచావో బేటీ పడావో'నినాదానికి మాత్రమే పరిమితమైందని, ఆచరణకు దూరమయిందని ఆక్షేపించారు. జూనియర్ వైద్యురాలిపై సెమినార్ హాల్లోనే ఇలాంటి ఘాతుకం జరిగిందంటే భారతదేశంలో మహిళలకు భద్రత ఎంత గొప్పగా ఉందో తెలుస్తోందన్నారు. పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరిచి, చట్టాలను కఠినంగా అమలు చేయాలని సూచించారు. స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లవుతున్నా దేశంలో రోజు రోజుకూ మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో దోషులు ఎంతటి వారైనా, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వీరాచారి, సత్యనారాయణ, పోతురాజు, రామారావు, బాబ్జి, హరీష్, రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో నేత్రాలు పదిలం



రెటీనా పరీక్షలు చేయించుకుంటున్న డీజీ నాథ్

పాయకరావుపేట : ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ తెలిపారు. ఆదివారం హైమ నేత్రాలయం సహకారంతో స్థానికంగా ఏర్పాటు చేసిన రెటీనా స్క్రీనింగ్ క్యాంపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైమ నేత్రాలయం సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి సీఈవో డాక్టర్ పీఎస్‌ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా షుగర్, బీపీ, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం వల్ల కంటి సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారని అన్నారు. రెటీనా స్క్రీనింగ్ క్యాంపునకు మండలంలో ఉపాధ్యాయులు హాజరై కంటి పరీక్షలు చేయించుకోవడం శుభపరిణామం అన్నారు. డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ షుగర్ వ్యాధి వలన కంటి రెటీనా డిటాచ్మెంట్, రెటీనా హేమరేజ్, డయాబెటిక్ రెటినోపతి వంటి సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఏవీ సూర్యనారాయణ, కార్యదర్శి పి.హరికృష్ణ, ఆర్.వీరభద్రరావు, పి.ఉమామహేశ్వరరావు, టి.తాతారావు, సత్య శ్రీనివాస్, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మునగపాక : మండలంలోని మూలపేట గంగాలమ్మ తల్లి గుడి ప్రారంభోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలపేట గ్రామస్తులంతా కలశాలతో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు పూర్తి చేశారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు సత్కారం



స్కూల్‌కమిటీ డైరెక్టర్లు, చైర్మన్లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. రాజుపేట స్కూల్ కమిటీ చైర్మన్‌గా టి.శ్రీను, వైస్ చైర్మన్‌గా ఉడికల ఈశ్వరరావు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులుగా గెలుపొందారు. అలాగే పాటిపల్లి మోడల్ స్కూల్ డైరెక్టర్లుగా రాపేటి పరమేష్, దళాయి లక్ష్మి అప్పలరెడ్డి గెలుపొందడంతో ఆదివారం వారిని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో ప్రసాద్ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కమిటీ పాలకవర్గ సభ్యులు అనునిత్యం పాఠశాలలు సందర్శించాలన్నారు. అలాగే పిల్లల చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరునాయుడు, ఇల్లా శిరీషా నాగేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, కర్రి రాము తదితరులు పాల్గొన్నారు.

యోగా, వ్యాయామంతో ఆరోగ్య సంరక్షణ



ఫిజియోథెరపిస్ట్ అపర్ణను శాలువాతో సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,, నిత్యం వ్యాయామం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రముఖ ఫిజియోథెరపిస్టు పీహెచ్ఎన్ అపర్ణ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ గుమస్తాల సంఘం కార్యాలయంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మానవుని జీవనశైలిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి వల్లే ఎక్కువగా వ్యాధుల బారినపడే అవకాశాలుంటాయన్నారు. వ్యాధి సోకిన తొలి దశలో వైద్యులను సంప్రదిస్తే త్వరితగతిన నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు అపర్ణను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు సాంబశివరావు, సీనియర్ సభ్యులు శరగడం నూకరాజు, కూండల రామకృష్ణ, దాడి సూరిబాబు, కుమార్, ఆళ్ల ఓంరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాల ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: గ్రామ దేవతల ఉత్సవాలను అందరూ కలిసికట్టుగా సుహృద్భావ వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. స్థానిక కోట్నీవీధి మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా అమ్మవారి ఘటాల ఊరేగింపును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు చేసిందన్నారు. ఉమ్మడి విశాఖలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం అమ్మవారి ఘటాలను పట్టణంలోని కోట్నీవీధి, మళ్లవీధి, తాకాశీవీధి, పెద్ద వీధి, భీమునిగుమ్మం, కొణతాలవారివీధి, సరసావారివీధి, నాయీబ్రాహ్మణవీధి, లక్ష్మీనారాయణనగర్ మీదుగా ఊరేగింపు నిర్వహించి, అమ్మవారి ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ని పూర్ణచంద్రహరినాథ్, ధర్మకర్తలు ఇల్లపు వెంకటరమణ, నగిరెడ్డి మధు, కోరుకొండ సంతోష్, ఇల్లపు జయశంకర్, గొర్లి రమణమ్మ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజించాలంటూ అవగాహన ర్యాలీ



మట్టి గణపతి విగ్రహాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆడారి కుమారస్వామి, మహిళలు

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు సెప్టెంబర్ 7న జరిగే వినాయక చవితికి మట్టి గణపతులనే పూజించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకుడు ఆడారి కుమారస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను చేతబట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాలను విడనాడాలని సూచించారు. మట్టి గణపతులు నదుల్లో, చెరువుల్లో తొందరగా కరిగి పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. పదేళ్లుగా పట్టణ, మండల పరిధిలో వినాయక విగ్రహాలు తయారుచేసే వారి వద్దకు వెళ్లి పీవోపీ బదులు మట్టి గణపతుల తయారీకి ప్రాధాన్యతనివ్వాల్సిందిగా కోరుతున్నట్లు తెలిపారు కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సోమశేఖర్‌పట్నాయక్, దాడి బుజ్జి, పెంటకోట వరప్రసాద్, కర్రి భరత్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి భజన మండలి వార్షికోత్సవం



రక్తదానం చేస్తున్న దాత

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలో ఆదివారం శ్రీ సత్యసాయి భజన మండలి 14వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సత్యసాయి బాబాను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 30 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. వేడుకలను సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి బాబా భజన మండలి అధ్యక్షుడు సరిసా శివ గణేష్, కన్వీనర్ శరగడం వెంకటరమణ, కాండ్రేగుల వెంకటప్పారావు, శరగడం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కళకళలాడాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో కిటకిటలాడాయి. తీరంలో ఇసుక తిన్నెలపై వాలీబాల్, క్రికెట్, కబడ్డీ వంటి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. సాయంత్రం సముద్ర స్నానాలు చేసి ఇంటి ముఖం పట్టారు. - పరవాడ

ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీనివాసుని ఆలయానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మునగపాకకు చెందిన బుదిరెడ్డి అప్పలనాయుడు-రమాదేవి దంపతుల కొడుకు, కోడలు ఉదయ-వాణి దంపతులు రూ.55,555 నగదును ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం జరుగుతుందని, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, ఆడారి అచ్చియ్యనాయుడు, వెలగా శ్రీనివాసరావు, జల్లేపల్లి కిష్టప్ప, విల్లూరి మోహన్, ఆడారి కృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com